క్లుప్తంగా

కల్యాణ మంటపం ప్రారంభం



కల్యాణ మంటపం ప్రారంభానికి ముందు పూజలు చేస్తున్న హనుమంతనాథస్వామిజీ

రొళ్ల: మండల పరిధిలోని కాల్వేపల్లి గ్రామంలో లక్ష్మీ రంగనాథస్వామి ఆలయం ఎదురుగా రంగనాథస్వామి సేవా సమితి పరిషత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతలు, భక్తుల సహకారంతో రూ.1.60 కోట్ల వ్యయంతో నిర్మించిన 'లక్ష్మీ రంగనాథస్వామి' కల్యాణ మంటపం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత కల్యాణ మంటపం ప్రారంభోత్సవ ప్రవేశ పూజ కార్యక్రమం చేపట్టారు. కర్ణాటక రాష్ట్రం కొరటగెర తాలూకా ఎలెరాంపుర కుంచిటి వక్కలిగ మహాసంస్థానం మఠాధిపతి హనుమంతనాథస్వామిజీ చేతుల మీదుగా కల్యాణ మంటపం ప్రధాన ద్వారానికి పూజలు చేసి ప్రవేశించారు. జెడ్పీటీసీ సభ్యుడు అనంత రాజు, వక్కలిగ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ పాండురంగప్ప తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ప్రిన్సిపాల్ మృతి



నరహరి (ఫైల్)

పెనుకొండ: విశ్రాంత ప్రిన్సిపాల్ జే. నరహరి గుండెపోటుతో మృతి చెందారు. దీంతో ఆదివారం పెనుకొండలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. పెనుకొండకు చెందిన నరహరి రొద్దం, పామిడి జూనియర్ కళాశాలల్లో ప్రిన్సిపాల్‌గా పని చేశారు. ప్రస్తుతం అనంతపురంలో ఉంటున్నారు. పెనుకొండ వాసి కావడంతో ఆయన మృతదేహాన్ని పెనుకొండకు తీసుకువచ్చి ఫైర్‌స్టేషన్ సమీపంలోని శ్మశాన వాటికలో ఖననం చేశారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి



పావగడ: తాలూకాలోని నాగలమడక హోబళి హొసహళ్లి తండాకు చెందిన కసన నాయకకు చెందిన 12 గొర్రె పిల్లలు ఆదివారం వీధి కుక్కల దాడిలో మృతి చెందాయి. ఈ ఘటనతో సుమారు లక్ష రూపాయలు నష్టం వచ్చిందని బాధితుడు కసన నాయక ఆవేదన వ్యక్తం చేశారు. తనకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని సంబంధిత అధికారులను వేడుకున్నాడు.

సమ్మె జయప్రదం చేయండి

సోమందేపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈ నెల 20న దేశ వ్యాప్త సమ్మె చేస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రమైన సోమందేపల్లిలో కరపత్రాలు విడుదల చేశారు. సీపీఐ నాయకులు బాలస్వామి, రాజ్‌గోపాల్, చాంద్‌బాషా, శ్రీకాంత్, గంగరాజు, శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

హిందూపురం: పట్టణంలోని డీఆర్‌కాలనీలో నివాసముంటున్న కాంతమ్మ శనివారం సాయంత్రం బయటకు వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. కాంతమ్మ కిందపడటంతో గాయపడింది. బాధితురాలిని ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిరుపయోగంగా టూరిస్ట్ పోలీస్ కేంద్రం

- పట్టించుకోని పోలీసు ఉన్నతాధికారులు

లేపాక్షి: పర్యాటకులు, భక్తుల సౌకర్యార్థం లేపాక్షిలోని నంది విగ్రహం ముందు ఏర్పాటు చేసిన టూరిస్ట్ పోలీసు కేంద్రం నిరుపయోగంగా మారింది. దీంతో టూరిస్ట్ పోలీసు కేంద్రం ఆకతాయిలకు అడ్డాగా మారడమే కాకుండా పర్యాటకులకు ఏ మాత్రం ఉపయోగపడటం లేదు.

21 ప్రాంతాల్లో ఏర్పాటు

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 21 పర్యాటక ప్రాంతాలలో టూరిస్ట్ పోలీస్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే లేపాక్షిలోనూ కేంద్రం ఏర్పాటైంది. ఏఎస్ఐతో పాటు నలుగురు పోలీసులను రొటేషన్ పద్ధతిలో విధులు నిర్వహిస్తూ భద్రతాపరంగా సేవలు అందించేవారు. ఏదైనా ఆపద, ప్రమాదం జరిగిన సమయాల్లో అప్రమత్తంగా వ్యవహరించేవారు. ప్రధానంగా పర్యాటకుల భద్రత, సేవాభావంపై దృష్టి సారించే వారు. ఆపద సమయంలో భక్తులకు సహాయ సహకారాలు కూడా అందించారు.



లేపాక్షిలో నిరుపయోగంగా మారిన పోలీసు కేంద్రం

వీకెండ్‌లో వేలాదిగా..

లేపాక్షి ఆలయానికి సామాన్య భక్తులే కాకుండా ప్రజాప్రతినిధులు, వీఐపీలు అధిక సంఖ్యలో వస్తుంటారు. పర్యాటకుల తాకిడి పెరిగిన నేపథ్యంలో వారందరికీ పూర్తిస్థాయిలో భద్రత ఏర్పాటు చేస్తారు. సుదూర ప్రాంతాల నుంచి అనేక మంది పర్యాటకులు వస్తున్నప్పటికీ వారికి సమాచారం ఇచ్చేవారు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే నంది విగ్రహం, థీంపార్కు, ఆర్చ్‌గేట్ వద్ద చిన్న చిన్న ప్రమాదాలు చోటు చేసుకుంటున్నప్పటికీ వాటిని నివారించడంలో పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రతి శని, ఆదివారాల్లో వేలాది మంది పర్యాకులు వచ్చినప్పుడు వాహనాలు ఎక్కువై ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. అధికారులు స్పందించి టూరిస్ట్ పోలీసు కేంద్రాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని పర్యాటకులు కోరుతున్నారు.

ఉపయోగంలోకి తీసుకురావాలి



లేపాక్షిలో పర్యాటకులకు సమాచారం ఇవ్వడానికి, ప్రమదాలు, భద్రత కోసం ఏర్పాటు చేసిన టూరిస్ట్ పోలీసు కేంద్రాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలి. గతంలో పర్యాటకుల కోసం పోలీసులు ప్రత్యేక చొరవ చూపి వారికి తగిన సమాచారం ఇవ్వడంతో పాటు ఆపద సమయంలో ఆదుకునేవారు. ఈ కేంద్రం ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. దీన్ని ఉపయోగంలోకి తీసుకొస్తే పర్యాటకులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

\- దిలీప్, బాగేపల్లి, కర్ణాటక

మరమ్మతు చేయించాల్సి ఉంది

పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన టూరిస్ట్ పోలీసు కేంద్రాన్ని యథావిధిగా కొనసాగిస్తాము. ఈ కేంద్రానికి కొంత మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. కొత్తగా సిబ్బంది నియమించి పోలీసు కేంద్రాన్ని కొనసాగించడం జరుగుతుంది. అయితే స్టేషన్‌లో ఉన్న సిబ్బందితోనే పనిచేయిస్తున్నాం. కొత్త సిబ్బంది కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాము.

\- జనార్దన్, సీఐ, హిందూపురం రూరల్

ఉష్ణోగ్రత సమాచారం	
హిందూపురం	35.0
పెనుకొండ	38.0
మడకశిర	35.0

పార్టీ బలోపేతానికి కృషి



మాట్లాడుతూన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

అమరాపురం: క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. ఆదివారం రాత్రి మండలంలోని బసవనపల్లి గ్రామ పంచాయతీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. రాబోవు కాలంలో వైఎస్సార్‌సీపీ అఖండ మెజార్టీతో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పార్టీ కోసం పని చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. మడకశిర నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివన్న, నాయకులు పండప్ప తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి రజినిపై సీఐ తీరు అమానుషం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



చిలమత్తూరు: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ మహిళా నేత విడదల రజినిపై చిలకలూరిపేట సీఐ సుబ్బరాయుడు ప్రవర్తన అమానుషమని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక మండిపడ్డారు. మహిళా బీసీ నేత అన్న సభ్యత మరచి కారులో నుంచి పక్కకు తోసేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం ఎక్కువ కాలం నడవదన్నారు. మొన్నటికి మొన్న ఓ మహిళా ఎంపీటీసీ అర్ధరాత్రి దుస్తులు మార్చుకునే సమయం ఇవ్వకుండా అరెస్ట్ చేశారన్నారు. పోలీసులు టీడీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని, మంత్రి లోకేష్ డైరెక్షన్‌లో నడుస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం శాశ్వతం కాదన్న విషయాన్ని పోలీసులు గుర్తించుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలాంటి దారుణ సంఘటనలు ఎన్నడూ చోటు చేసుకోలేదని స్పష్టం చేశారు. మాజీ మంత్రిపై దురుసుగా ప్రవర్తించిన సీఐపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కర్బూజ పంటకు నష్టం



కోతకు వచ్చిన పంట నాశనమైన దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది గ్రామ సమీపంలోని మారెమ్మ దేవాలయం వద్ద కర్బూజ పంటను ఎలుగుబంట్లు ధ్వంసం చేశాయి. బాధిత రైతు నాగభూషణరెడ్డి వివరాల మేరకు... అప్పులు చేసి బోరు బావి కింద రెండు ఎకరాల్లో సాగు చేసిన కర్బూజ పంటలోకి శనివారం రాత్రి ఎలుగుబంట్లు ప్రవేశించి కోతకు వచ్చిన కాయలను కొరికేయడంతో పాటు పంటను ధ్వంసం చేయడంతో తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరారు.

ధ్యానంతో ఆరోగ్యం



శిక్షణ తరగతుల్లో ధ్యానం చేస్తున్న దృశ్యం

హిందూపురం: స్థానిక ఎస్‌డీజీఎస్ కళాశాల సెమినార్ హాల్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ స్థాపకులు రవిశంకర్ గురూజీ శిష్య బృందంచే నిర్వహించిన ధ్యాన్యం శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. దైనందిక జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ధ్యానం ఒక్కటే మార్గమని వక్తులు తెలియజేశారు. కార్యక్రమంలో యోగా వలంటీర్లు వెంకటస్వామి, రాంప్రసాద్, గంగాధర్, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం కమిటీ ఏర్పాటు



నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

పెనుకొండ: పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. శ్రీసత్యసాయి జిల్లా మేవా అధ్యక్షుడిగా మన్నల సుధాకర్, ఉపాధ్యక్షురాలిగా ఎం. గౌరమ్మ, తిప్పేస్వామి, ప్రధాన కార్యదర్శిగా విద్యాసాగర్, కోశాధికారిగా గంగాధరప్పను ఎన్నుకున్నారు. పర్యవేక్షకులుగా విచ్చేసిన అనంతపురం జిల్లా మేవా అధ్యక్షుడు సురేష్‌బాబు, ఉపాధ్యక్షుడు అహోబిలేసు తదితరులు పాల్గొన్నారు. మేవా నాయకులు ఎంఎస్. మూర్తి, శంకర్, కురుగుంట గోవింద్, గడ్డం శ్రీనివాసులు, గొల్లపల్లి నాగేంద్ర, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నిరసనను విజయవంతం చేయండి

మడకశిరరూరల్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. పాఠశాల సమస్యలపై చర్చించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలల పునఃవ్యవస్థకరణ, బదిలీలు, ప్రమోషన్లు తదితర వాటిపై విద్యాశాఖ అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ గౌరవాధ్యక్షులు భూతన్న, రాష్ట్ర కార్యదర్శులు మనోహర్, జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వీరజవాన్‌కు ఘన నివాళి



మురళీ నాయక్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు దీపిక, ఈరలక్కప్ప, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి



మడకశిరలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హిందూపురంటౌన్/హిందూపురం/మడకశిర: పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్ మురళీనాయక్ పలువురు నివాళులర్పించారు. హిందూపురం పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో మురళీనాయక్ చిత్రపటం వద్ద ఎంఈఓ గంగప్ప, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో డీఎం శ్రీకాంత్ ఆధ్వర్యంలో మురళీనాయక్ ఆత్మకు శాంతి కలగాలని సిబ్బంది రెండు నిముషాలు మౌనం పాటించారు. మడకశిర పట్టణంలో వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో వీర జవాన్ మురళీనాయక్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.



హిందూపురం: వీర జవాన్‌కు నివాళులర్పిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులు

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం



అలంకరణలో ఆంజనేయస్వామి

అగళి: మండల పరిధిలోని కొడిపల్లి గ్రామంలో వెలసిన అంజనేయ స్వామికి ఆదివారం ఆలూడి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. మహిళలు జ్యోతులను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామి వారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

రొద్దం: మండల పరిధిలోని కందకూర్లపల్లిలో పెద్ద ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా శనివారం రాత్రి సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గ్రామంలో నూతనంగా నిరించిన ఆలయంలో నాలుగు రోజుల పాటు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలను నిర్వహించారు.

అ'పూర్వ' సమ్మేళనం



పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

రొద్దం: మండల పరిధిలోని కోగిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2011–2012కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఏళ్ల తరువాత ఒకే వేదికపైకి రావడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోండి

హిందూపురం టౌన్: పట్టణంలోని నారాయణ, శ్రీచైతన్యతో పాటు పలు ప్రైవేటు విద్యాసంస్థలు సెలవు రోజుల్లోనూ తరగతులు నిర్వహిస్తుండటంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలియజేసి విద్యాసంస్థలను బంద్ చేయించారు. ఆదివారం పలు విద్యాసంస్థలను బంద్ చేయించిన అనంతరం వారు మాట్లాడారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రైవేటు విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు, ప్రచారాలు నిర్వహిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కన్వీనర్ అఫ్రీద్, కో కన్వీనర్ అజ్మల్, వినీత్, మోహన్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పండి

పావగడ: ఉగ్రవాద సంస్థలను సమూలంగా మట్టుబెట్టి ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పాలని స్థానిక కర్ణాటక రాజ్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిలో ఆదివారం నిరసన తెలియజేశారు. పాకిస్తాన్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరాదన్నారు.

నృసింహా పాహి.. పాహి





భక్తరహళ్లి నృసింహాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు , హిందూపురం: జ్యోతులు మోస్తున్న భక్తులు

హిందూపురం: పట్టణంలోని నింకంపల్లిలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు జ్యోతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తిరుకల్యాణోత్సవం కనుల విందుగా సాగింది. సంప్రదాయబద్ధంగా కల్యాణాన్ని జరిపించారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం నృసింహుని జయంతి వేడుకలను నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి లక్షార్చన పూజ నిర్వహించారు. అలాగే నీలకంఠాపురం, రేకులకుంట గ్రామాల్లో లక్ష్మీనరసింహ స్వామి ఆలయాల్లో పూజలు జరిగాయి.

మలుపు.. ప్రమాదానికి పిలుపు



మాధుడికి వెళ్లే దారిలో మలుపు వద్ద పెరిగిన పిచ్చి మొక్కలు



కంబదపల్లిలో మలుపు వద్ద హెచ్చరిక బోర్డు లేని దృశ్యం

అగళి: మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల వెంట ఉన్న మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. మండలంలోని నరసబుంది, మాధుడి, కరిదాసన్నపల్లి ,ఇనగలూరు, ఆలుడి తదితర గ్రామలకు వెళ్లే రహదారుల్లో మూల మలుపులు ఉన్నాయి. దీంతో ఆ రహదారుల వెంట ప్రయాణం చేసేవారు ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని భయం భయంగా వెళ్లాల్సిన పరిస్థితి. కొన్నిచోట్ల హెచ్చరిక బోర్డులు లేకపోగా, కొన్ని చోట్ల కంపచెట్లు పెరిగి అవతల వస్తున్న వారు కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని కంపచెట్లు తొలగించడంతో పాటు ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

కంప చెట్లు తొలగించాలి



ప్రధాన రహదారుల మూల మలుపుల వద్ద పెరిగిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలి. వాహనదారులకు ముందు నుంచి వచ్చే వాహనాలు కనిపించకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలి.

\- సన్నహనుమప్ప, డ్రైవర్, అగళి

సూచికలు ఏర్పాటు చేయాలి



మాధూడి నుంచి ఆలూడికి వెళ్లే రహదారిలో మూల మలుపుల వద్ద తప్పనిసరిగా ప్రమాద హెచ్చరికలను సూచించే బోర్డులను ఏర్పాటు చేయాలి. ఇప్పటికే చాలా ప్రమాదాలు జరిగాయి. ఇక మీదనైనా నివారణకు చర్యలు చేపట్టాలి.

\- హనుమంతరాయప్ప, కోమరేపల్లి, అగళి మండలం

దాడిపై సర్పంచ్ ఫిర్యాదు

సోమందేపల్లి: మండలలోని నాగినాయని చెరువు తండా వద్ద ట్రాక్టర్ యజమాని శ్రీనివాసులు, అతని సోదరుడు ప్రసాద్ తనపై దాడి చేసినట్లు సర్పంచ్ అంజినాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం సోమందేపల్లి వైపు కారులో వస్తుండగా అతి వేగంగా ట్రాక్టర్ తనపై దూసుకురావడంతో జాగ్రత్తగా నడపాలని సూచించగా తనపై దాడికు పాల్పడినట్లు సర్పంచ్ తెలిపారు. పోలీసుస్టేషన్‌కు వెళ్తుండగా మరోసారి తనతో పాటు పవన్‌నాయక్‌పై శ్రీనివాసులు తదితులు దాడికి యత్నించారన్నారు. ఇరువర్గాలు స్టేషన్ వద్దకు చేరుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడిన సంఘటన పెనుకొండ 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. మలకవేమలకు చెందిన చెన్నకేశవరెడ్డి ద్విచక్ర వాహనంలో కియా మెయిన్ గేట్ ఎదురుగా రోడ్డు దాటే క్రమంలో బెంగళూరు వైపు నుంచి అనంతపురం వెళ్తున్న ఐచర్ వాహనం ఢీకొంది. ప్రమాద ఘటనలో చెన్నకేశవరెడ్డి గాయపడ్డాడు. 108 వాహనంలో పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.